## ఎలుగుబంటుల దాడి : ఇద్దరికి తీవ్రగాయాలు



వెంకటగిరి, జూన్ 18, ప్రభాతవార్త

వెంకటగిరి ప్రాంతంలోని వెలుగొండ అడవులలో కావడి అంకయ్య, మునయ్యలపై రెండు ఎలుగు బంటులు దాడి చేయడంతో తీవ్రంగా గాయ పడ్డారు. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం బంధువులు వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంకయ్య, మునేయలు ఈత పండ్లు కోసుకునేందుకు అలవాటు ప్రకారం వెలుగొండ అడవులకు వెళ్లారు. ఉదయం 6 గంటలకు వీరు ఈత పనుల కోసం ఎందుకు అడవుల్లోకి వెళ్ళగా ఉన్న ఫలంగా గా రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. ఎలుగుబంటిల దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరితో వెళ్లే వాళ్ల కొందరు వీరి అరుపులు కేకలు విని అరుసుకుంటూ రావడంతో ఎలుగుబంటులు వెళ్లిపోయాయి. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం డాక్టర్లు తిరుపతికి ఆసుపత్రికి తరలించారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## 42 వేల టన్నుల
## తోతాపురి మామిడి కొనుగోలు

**- స్థిరంగా మామిడి ధరలు**
**- పల్ప్ ఫ్యాక్టరీలకు పక్వానికి వచ్చిన మామిడి తరలింపు**
**- ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి**

చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:

జిల్లాలోని 27 ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఇప్పటి వరకు సుమారు 42 వేల టన్నుల తోతాపురి మామిడి కాయలను సేకరించడం జరిగిందని ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి అన్నారు. పూతలపట్టు మండలం వడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలకు హార్టికల్చర్ డిడి మధుసూధన్‌రెడ్డితో పాటు ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి హాజరై పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడి కాయలు తరలింపుపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే అక్కడే గ్లోబల్ పామ్స్ వద్ద ప్రాసెసింగ్ యూనిట్ యాజమాన్యంను సమన్వయం చేసుకుని 92 మంది రైతులకు మామిడి అమ్మకం టోకన్లను ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి పంపిణీ చేశారు. ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం తోతాపురి మామిడి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పక్వానికి వచ్చిన కాయలు మాత్రమే ప్రాసెసింగ్ యూనిట్‌లకు తరలించాలని తెలిపారు. మండలాల్లో గ్రామసభల ద్వారా మామిడి అమ్మకంపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మామిడి రైతులకు సలహాలు, సూచనల కోసం ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద షిఫ్ట్‌ల వారీగా ప్రభుత్వ ఉద్యోగులను నియమించడం జరిగిందన్నారు. మామిడి రైతుల సందేహాల నివృత్తి కోసం హెల్ప్ లైన్ నెంబర్ 08572-242777, 94910 77325 నెంబర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## అధికారుల మాటల్లో → మామిడి ధర సూపర్!

**- క్షేత్ర స్థాయిలో మామిడి రైతుకు తీరని అన్యాయం - చిత్తూరులో ఉచితంగా లారీ మామిడి పండ్లు పంపిణీ**

చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:

ఈ సీజన్‌లో తోతాపురి మామిడి రైతుకు కేజీకి రూ.12 ఇస్తున్నాం. ఇందులో పల్ప్ ఫ్యాక్టరీలు రైతుకు కేజీకి రూ.8 ఇవ్వాలి. ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతుకు కేజీ తోతాపురి మామిడిపై రూ.4 చెల్లిస్తోంది. ఇది మొన్నటి నుండి ఇప్పటి వరకు ప్రభుత్వం, అధికారులు చెప్తున్న మాట. రైతులు సైతం ఈ పరిస్థితుల్లో ఫ్యాక్టరీలు, ప్రభుత్వం కలిసి కేజీ తోతాపురి మామిడిపై రూ.12 ఇస్తే అదే మహాభాగ్యం అంటూ మురిసిపోయారు. అయితే క్షేత్ర స్థాయిలో ఇటు ప్రభుత్వం, అటు అధికారులు చెప్పిన ఏ ఒక్క మాట వాస్తవ రూపం దాల్చలేదు. తోతాపురి మామిడి రైతులు పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడి కాయలను తీసుకెళ్తే అక్కడ ఫ్యాక్టరీ లోపలికి రైతుల మామిడి కాయలను అనుమతించడం లేదు. కొన్ని ఫ్యాక్టరీల్లో లారీలు, ట్రాక్టర్లు మామిడి కాయలను తీసుకెళ్ళి రెండు, మూడు రోజులు అవుతున్నప్పటికీ ఆ కాయలు ఫ్యాక్టరీలో అన్‌లోడ్ కావడం లేదు. మరోవైపు హార్టికల్చర్, అగ్రికల్చర్, రెవెన్యూ అధికారులు రైతులు తీసుకువచ్చే మామిడి కాయలను పరిశీలించి నమోదు చేసుకుంటున్నారు. ఇలా అధికారులు నమోదు చేసుకున్న కాయలను ఫ్యాక్టరీల్లోకి వెళ్ళి అన్‌లోడ్ చేయాలని భావించిన రైతుకు చేదు అనుభవం ఎదురవుతుంది. ప్రభుత్వం కేజీ తోతాపురి మామిడికి సబ్సిడీ కింద రూ.4 మంజూరు చేస్తే, పల్ప్ ఫ్యాక్టరీ యాజమాని కేజీ తోతాపురి మామిడిపై రైతుకు రూ.8 చెల్లించాలి. అయితే ఏ ఒక్క ఫ్యాక్టరీ రైతుకు కేజీ తోతాపురిపై రూ.8 చెల్లించడానికి సిద్ధంగా లేదు. కొన్ని ఫ్యాక్టరీలో కేజీ తోతాపురిపై రూ.7 చెల్లిస్తుంటే కొన్ని ఫ్యాక్టరీలు కేజీ తోతాపురిపై రైతుకు రూ.6 చెల్లిస్తున్నాయి. ఈ మొత్తంను సైతం రైతుకు ఫ్యాక్టరీలు ఇప్పట్లో ఇచ్చే సూచనలు కన్పించడం లేదు. రైతులు సైతం తమ వద్ద వున్న మామిడి కాయలను ఫ్యాక్టరీలు కొనుగోలు చేస్తే చాలని, ఎంతో కొంత డబ్బులు ఎప్పుడో ఒకప్పుడు ఇస్తే చాలనే ధోరణితో తమ వద్ద వున్న మామిడి కాయలను ఫ్యాక్టరీలు తీసుకుంటే చాలనే విసుగుతో వున్నారు. ఈ క్రమంలో చిత్తూరులో బుధవారం ఓ రైతు ఫ్యాక్టరీకి తరలించడానికి తీసుకువచ్చిన మామిడిని ఫ్యాక్టరీలు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం, తక్కువ ధర ఇచ్చినప్పటికీ తన వద్ద వున్న మామిడిని అసలు ఫ్యాక్టరీలోకి తీసుకెళ్ళడానికి అనుమతి ఇవ్వకపోవడంతో విసుగు చెందిన ఆ రైతు నేరుగా చిత్తూరులోకి లారీ మామిడి పండ్లను లారీతో పాటు తీసుకువచ్చేశాడు. కైలాసపురం వద్ద లారీని నిలుపుదల చేసిన ఆ రైతు అక్కడే రైతులకు ఉచితంగా మామిడి పండ్లను పంపిణీ చేయడం ప్రారంభించాడు. అలాగే లారీలో వున్న మామిడి కాయలను రోడ్డుపై పారవేసి ఇక మామిడి కాయల జోలికి వెళ్ళను. తన తోటలో వున్న మామిడి కాయలను అలాగే వదలి వేస్తాను అని భీష్మ ప్రతిజ్ఞ చేసి వెళ్ళాడు.



కైలాసపురంలో లారీ మామిడిని ఉచితంగా పంపిణీ చేసి మిగిలినవి రోడ్డుపై పడవేసిన రైతు.

## అదునులో ఏదీ పదును !

- దోబూచులాడుతున్న వరుణుడు - సందిగ్ధంలో వేరుశనగ రైతులు



కోట, జూన్ 18 ప్రభాతవార్త

ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగను ప్రధాన వాణిజ్య పంటగా రైతులు సాగు చేస్తుంటారు. కోట మండలం చిట్టేడు, మద్దాలి, కేశవరం, రాఘవాపురం, వజ్జావారిపాలెం, తిన్నెలపూడి, గూడలి తదితర గ్రామాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తుంటారు. ఈ పంట సాగుకు గత ఐదేళ్లుగా పరిస్థితులు అనుకూలించడం లేదు. ఫలితంగా అరాకొరా విస్తీర్ణంలోనే సాగైంది. ఈ సారయినా వంద శాతం సాగు చేద్దామనుకున్న రైతులతో వరుణుడు దోబూచులాడుతున్నాడు. ఈ ఏడాది రుతుపవనాలు 15 రోజులు ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో రైతుల్లో ఆనందం వెల్లువిరిసింది. ఖరీఫ్ సాగు సకాలంలోనే ప్రారంభించవచ్చని ఆశించారు. అయితే పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అడపాదడపా జల్లులు తప్ప నేల పదునయ్యే వానలే లేకపోయాయి. దీంతో ఇప్పటివరకు ఒక్క ఎకరా కూడా సాగు కాలేదు. ఓ వైపు అదును దాటుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆలస్యమయ్యే కొద్దీ దిగుబడి నాణ్యతపై ప్రభావం పడుతుందని అంటున్నారు. ఈ విషయమై ఏఓ సుచేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులు జూలై 15వ తేదీ వరకు వేరుశనగ సాగు చేయవచ్చన్నారు. అందుకు అవసరమైన విత్తనాలు ప్రభుత్వం రాయితీ ఇవ్వడం లేదని, విత్తనాలు కావలసిన రైతులు శ్రీకాళహస్తికి వెళ్లి తెచ్చుకోవచ్చని సూచించారు.

## యోగాతో ఆరోగ్యం: దైనందిన జీవితంలో ఆనందం

### 2వేల మందితో శ్రీకాళహస్తిలో సాధన



శ్రీకాళహస్తి, జూన్ 18 ప్రభాతవార్త

దైనందిన జీవితంలో ఉరుకులు, పరుగులు, సమస్యలతో సతమతం. ఇలాంటి పరిస్థితిని తట్టుకొనుటకు యోగాసాధన ఎంతో అవసరం అని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ అన్నారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్మించిన రాజగోపురం వద్ద సుమారు 2వేల మందితో ప్రయోగాత్మక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా యోగా మన శరీరానికి మేలు చేయటంతో పాటు ఏకాగ్రత పెంచుతుందని, మానసిక వత్తిడి నుంచి ఉపశమనం కల్గిస్తుందని వివరించారు. మానసిక వత్తిని జయించే రీతిలో ప్రతి ఒక్కరు కనీసం రోజులో ఉదయం వేళ ఒక గంట ఆచరిస్తే రోగాలు దరి చేరవని సుధీర్‌రెడ్డి సూచించారు. దైనందిన జీవితంలో తీవ్ర మానసిక వత్తిడుల నుంచి ఉపశమనం పొందటానికి యోగా సాధనే మార్గమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ వివరించారు. ప్రతి ఒక్కరు జీవితంలో యోగా సాధనచేస్తే సంపూర్ణారోగ్యవంతులుగా ఉంటారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ అన్నారు.

**పచ్చని పచ్చిక బైళ్ళపై కదలి వచ్చిన యంత్రాంగం:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న రాజగోపురం వద్ద వేలాది మంది యోగా సాధనకు హాజరయ్యారు. ఆలయాధికారులు చక్కటి ఏర్పాట్లు చేసారు. అంతర్జాతీయ యోగ కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల నిర్వహణకు వారం రోజులుగా ఏర్పాట్లును జిల్లా అధికారులు పర్యవేక్షించారు. ఓ వైపు జిలాన్ల అధికార యంత్రాంగం మరో వైపు విద్యార్థులు ఇంకొక వైపు తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజగోపురం చుట్టు బారికేడ్లు ఏర్పాటు చేసి ఎలాంటి అవరోధం కల్గకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐలు డి.గోపి, నాగార్జున్‌రెడ్డి వారి సిబ్బంది పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ తోపాఉ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్ధన్‌రెడ్డి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ సంజీవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## తనిఖీలు వేగవంతం చేయాలి

**-టిటిడి ఈఓ, అదనపుఈఓ**



తిరుమల, జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలకు వస్తున్న యాత్రికుల సంఖ్య, వాహనాలు పెరిగిపోతున్న తరుణంలో అలిపిరి తనిఖీ కేంద్రంలో అధునాతన సాంకేతిక స్కానర్లు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని టిటిడి ఈఓ శ్యామల రావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సూచించారు. ఇందుకు అవసరమైన అధునాతన సాంకేతిక స్కానర్లు తీసుకు రావాలని తెలిపారు. ముఖ్యంగా యాత్రికుల వాహనాలు, లగేజీలను మరింత త్వరగా తనిఖీ చేసేందుకు రెండు లేన్లలో మరింతమంది అదనపు భద్రత సిబ్బందిని నియమించేందుకు అనుమతిం చారు. అలిపిరి తనిఖీకేంద్రం బలోపేతం, రానున్నరోజుల్లో యాత్రికుల సంఖ్యపెరిగినా లగేజీ తనిఖీలు, వాహనాల తనిఖీలు వేగంగా చేపట్టేందుకు తీసుకోవాల్సిన ఏర్పాట్లు, యంత్రాలు అవసరంపై బుధవారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో సమీక్షించారు. రాక్సా సిఈఓ అమిత్‌దార్, సివిఎస్ఓ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, ఇఇ వేణుగోపాల్, రవాణా జిఎం శేషారెడ్డి, విఎస్ఓలు ఎన్టీవిరామ్‌కుమార్, సదాలక్ష్మి, సురేంద్రతో కీలక అంశాలపై చర్చించారు.

## డివైడర్‌ను ఢీకొట్టిన బొలేరో

### బొలేరోను ఢీ కొట్టిన ఆటో
### ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

చంద్రగిరి, జూన్ 18 ప్రభాతవార్త:

మామిడికాయలు లోడుతో వస్తున్న బొలేరో వాహనం టైరు యాక్సెల్‌తో సహా వాహనం నుండి విడిపోవడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన బుధవారం వేకుజామున మామండూరు సమీపంలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. బంగారుపాళ్యం నుండి వినుకొండకు మామిడికాయలు లోడుతో వెళుతున్న బొలేరో వాహనం ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. పాకాల మండలం, శంఖంవారిపల్లి నుండి తిరుపతికి ప్రయాణికులతో వస్తున్న ఆటో ముందు వెళుతున్న బొలేరో వాహనం ఒక్కసారిగా ప్రమాదానికి గురికావడంతో అదుపు చేయలేని ఆటో డ్రైవర్ కిషోర్ బొలేరో వాహనాన్ని వెనుక నుండి ఢీ కొట్టాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పెద్దబయనపల్లికి చెందిన ధనంజయులు రెడ్డి (36) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రగాయాల పాలవగా, మరో ఇద్దరు ప్రయాణికులు స్వల్పగాయాలకు గురయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని క్రేన్ సాయంతో రెండు వాహనాలను రోడ్డు ప్రక్కకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం ధనంజయులు రెడ్డి మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఎస్ఐ అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## అంగన్‌వాడీ కార్యకర్తపై
## కోఆప్షన్ సభ్యుడి దాడి

### నరికేస్తామంటూ బెదిరింపులు..
### ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు

కుప్పంరూరల్, జూన్ 18 ప్రభాతవార్త

అంగన్‌వాడీ కార్యకర్తపై వైకాపాకు చెందిన కోఆప్షన్ సభ్యుడు, రౌడీషీటర్ అయిన అతహర్, అతని సోదరుడు దాడి చేసిన సంఘటన బుధవారం మండలంలోని రాగిమానుమిట్ట గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. రాగిమానుమిట్ట గ్రామంలో వైకాపా నేత, కోఆప్షన్ సభ్యుడు అయిన అతహర్ అతని కుటుంబీకులు ఉంటున్నారు. అదే గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా నజ్మా పనిచేస్తోంది. ఈమె అతహర్‌కు స్వయానా వదిన. అయితే కుటుంబ తగాదాల కారణంగా వీరు వేర్వేరుగా ఉంటున్నారు. కాగా వైకాపా పాలనలో అతహర్ తమ ఇంటికి నీటి పైపులైను నేరుగా వేయించుకున్నాడు. దీంతో మిగతా కుటుంబాలకు నీరు చాలడం లేదని బుధవారం అతహర్ వదిన అయిన నజ్మా, మరికొందరు మహిళలు నీటి పైపులైను వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో అతహర్ భార్య సైతం అక్కడకు రావడంతో ఆమె, నజా ్మల మధ్య గొడవ మొదలైంది. విషయం తెలుసుకున్న అతహర్, అతని సోదరుడు అక్కడకు చేరుకుని నజ్మాపై దాడిచేసి గాయపరిచారు. అతహర్ సోదరుడు కత్తి తీసుకొచ్చి నరికేస్తానని బెదిరించాడన్నారు. కాగా తనకు అతహర్ కుటుంబంతో ప్రాణహాని ఉందని బాధితురాలు పేర్కొంది. గతంలో సైతం ఎమ్మెల్సీ భరత్‌కు తనపై కావాలనే ఫిర్యాదులు చేసి వేధించేవాడని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కో ఆప్షన్ సభ్యుడు అతహర్, అతని సోదరుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అంగన్‌వాడీ కార్యకర్తను ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్ పరామర్శించారు.



## ఆగిన కార్పోరేషన్ స్థలం అమ్మకం!

### కూటమినేతలకు "జనం"భయం!!
### -విప్‌కు కట్టుబడిన వైసిపి కార్పొరేటర్లు

**"వార్త"ప్రభావం**





తిరుపతి, జూన్ 18ప్రభాతవార్త:

తిరుపతి జనం అంతా అనుకున్నట్లే నగరంలో వందలకోట్లరూపాయలు విలువైన కార్పొరేషన్ స్థలం అమ్మకం ఆగిపోయింది. కూటమినేతలు వేసిన పథకం బెడిసికొట్టేలా ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్పొరేటర్లు ప్రజలకు మద్దతుగా నిలవడమేగాక ఆ పార్టీ సమన్వయనేత, మాజీ ఉపమేయర్ భూమన అభినయరెడ్డి వ్యూహం అమలుతో మున్సిపల్ కౌన్సిల్‌లో చాళుక్యలాడ్జి స్థలం అమ్మకానికి బ్రేక్ పడింది. ఇది కూటమినేతలకు జనం భయంగా తిరుపతివాసులు అభివర్ణించారు. రాష్ట్రంలో కూటమిప్రభుత్వం ఏర్పాటైన ఏడాదికాలం తరువాత తిరుపతిలో మూడు పార్టీలకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులతోబాటు నగరపాలకసంస్థ కౌన్సిల్‌లో ఓ డిప్యూటీ మేయర్ స్థలంపై కన్నేశారు. ఈ స్థలాన్ని తమవారికి అప్పనంగా తక్కువ ధరకు కట్టబెట్టేందుకు కౌన్సిల్ సమావేశం అజెండాతో ముందుకు నడిచారు. అయితే 24గంటలు ముందుగానే స్థలం అమ్మకంపై తిరుపతిజనంలో చర్చనీయాంశమై సంచలనంగా మారింది. "వార్త"లో "మున్సిపల్ కార్పొరేషన్ స్థలం అప్పనంగా దోచేస్తారా!? పాత చాళుక్యలాడ్జి పై కూటమినేతల కన్ను"శీర్షికన కథనం వెలువడింది. దీంతో బుధవారం ఉదయం 6గంటలకల్లా కార్పొరేషన్‌లో వైసిపి బలమున్న కార్పొరేటర్లు దీన్ని అడ్డుకోవాలని ఆ పార్టీ సమన్వయనేత భూమన అభినయ్‌రెడ్డి ఆఘమేగాలపై విప్ జారీచేశారు. కార్పొరేటర్లు మున్సిపల్ స్థలం అమ్మకుండా అడ్డుకోవాలని నిర్దేశం చేశారు. విప్‌కు కట్టుబడిన వైసిపి కార్పొరేటర్లలో 30మంది ఆ స్థలాన్ని అమ్మడాన్ని వ్యతిరేకించారు. కూటమికి మద్దతుగా కేవలం 12మంది కార్పొరేటర్లు అనుకూలంగా వ్యవహరించారు. కౌన్సిల్‌లో 47మంది కార్పొరేటర్లలో 42మంది సమావేశానికి హాజరుతో కార్పొరేషన్ స్థలం పాత చాళుక్యలాడ్జి భవనం ఉన్న 924 అంకణాలు 138కోట్లు రూపాయలు విలువైన ఈ ఖరీదైన స్థలం అమ్మకుండా చొరవచూపారు.. జనం నుండి తీవ్రవ్యతిరేకత రావడంతో వైసిపి కార్పొరేటర్లు తెలివితో వ్యూహాత్మకంగా జనంవైపు నిలబడ్డారు. దీంతో అసలు అజెండా వీగిపోయింది. స్థలాలు అమ్మడం ఒకమార్గం కాదని, వ్యతిరేకిస్తున్నామని ఎక్స్అఫిషియోసభ్యుడు ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం తేల్చేశారు. కార్పొరేషన్ స్థలం అమ్మడాన్ని వైసిపి కార్పొరేటర్లు మేయర్ శిరీషతోబాటు అన్నాఅనిత, నరసింహాచారి, ఎస్‌కె బాబు, ఖాదర్‌బాష, ఆదంరాధాకృష్ణారెడ్డి, మునిరామిరెడ్డి, ఆంజనేయులు, శాలినిరెడ్డి, ఉమాయాదవ్, గణేశ్, అమర్‌నాథ్‌రెడ్డి, సునీత, రామస్వామి వెంకటేశ్, తాజిన్, ఆదిలక్ష్మి, గీత, కోటేశ్వరమ్మ, అనిత, అనిల్, శ్రావణి, కోఆప్షన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, శ్రీదేవి, ఖాదర్‌బాషా, రాజేశ్వరి వ్యతిరేకించారు.

**మున్సిపల్ స్థలం పరిరక్షించిన కార్పొరేటర్లకు ధన్యవాదాలు:అభినయ్**

తిరుపతి నగరంలో వందలకోట్లు విలువైన మున్సిపల్ స్థలాన్ని అమ్మకుండా అడ్డుకున్న కార్పొరేటర్లు, నగరవాసులకు వైసిపి సమన్వయనేత భూమన అభినయ్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ స్థలాన్ని విక్రయించి భారీ మొత్తంలో వెనుకేసుకోవాలని చూసిన కూటమి నేతలకు వ్యతిరేకత తెలిసొచ్చింది. ప్రజల ఆశీర్వాదంతో నగర అభివృద్ధికి పనిచేస్తానని ఆయన అన్నారు.

## ఆలయాల్లో భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి



**తిరుపతి ఆర్జెసీ చంద్రశేఖర్ ఆజాద్**

కాణిపాకం, జూన్ 18 ప్రభాతవార్త:

జిల్లాలోని ఆలయాల్లో భక్తులకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని దేవాదాయశాఖ తిరుపతి ఆర్జెసీ చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. బుధవారం కాణిపాకం దేవస్థానం ఈఓ కార్యాలయం సమావేశం మందిరంలో కాణిపాకం ఆలయ ఈఓ పెంచల కిషోర్‌తో కలసి జిల్లాలోని వివిధ చిన్న దేవాలయాల ఈఓలతో సమావేశం ఆలయాల్లో భక్తులకు మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆలయాల దర్శనార్థం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ఈమేరకు ఆలయాల వద్ద క్యూలైన్లు, వసతి సౌకర్యాలు, నాణ్యమైన లడ్డూ వడ ప్రసాదాలు వంటి వాటిని భక్తులకు అందించాలని సూచించారు. అలాగే ఆయా ఆలయాల వారిగా సమీక్ష నిర్వహిస్తూ పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, కాణిపాకం ఆలయ ఏఈఓలు కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనుంజయ, జిల్లాలోని వివిధ ఆలయాల ఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు పేరే లేదంటే... ఇక అభివృద్ధి ఎక్కడ?

పూతలపట్టు, జూన్ 18, ప్రభాతవార్త

రంగంపేట క్రాస్.. ఇది కడప – తిరుపతి – బెంగుళూరు ప్రధాన మార్గానికి హృదయకవాటం.. జాతీయ రహదారి ప్రాజెక్ట్ (ఎన్‌హెచ్‌ఏఐ) ద్వారా అభివృద్ధి చేసిన ఈ మార్గం చిత్తూరు నగరానికి అభివృద్ధి తలుపులు తెరిచే అవకాశంగా మారుతుంది అనుకున్నారు ప్రజలు. కానీ ఆ ఆశలు ఓ గ్రీన్ బోర్డుతో నీరుగారిపోయాయి. పూతలపట్టు వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో పూతలపట్టు – 2 కిలోమీటర్లు అని మాత్రమే ఉందే తప్ప, చిత్తూరు పేరు లేదు. ఇదేంటీ దురదృష్టం! ఇది కేవలం బోర్డు సమస్య కాదు... ఇది చిత్తూరు నగర ప్రాధాన్యతను చిన్నచూపు చూసే నిర్వాకం అంటున్నారు సామన్య ప్రజలు. చిత్తూరు పేరు లేకపోవడం వల్ల నష్టమేమిటంటే? అనేక మంది పర్యాటకులు, వాణిజ్య యాత్రికులు చిత్తూరును అనుకోకుండా దాటి పోతున్నారు. ఈ కారణంగా




హోటళ్ళు, లాడ్జీలు, రైస్ మిల్లులు, బెల్లం వ్యాపారాలు, మామిడికాయ మండీ, తదితర చిత్తూరు అభివృద్ధి తీవ్రంగా నష్టపోతున్నాయి. ఇది కేవలం వ్యాపార వృద్ధికి అడ్డుగానే కాక, రాష్ట్రం – కేంద్ర ప్రభుత్వాలకు కూడా జీఎస్‌టీ వంటి పన్నుల్లో కోత తెస్తోంది. ఇది వాస్తవంగా అభివృద్ధిని వెనక్కి లాగే పరిస్థితి. ప్రశ్నించాలి – సమాధానాల కోసం కాదు, పరిష్కారం కోసం చిత్తూరు పేరు ఎందుకు లేదు? ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు మనమూ ఇప్పుడు ప్రశ్నించాలి. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు కాదు – నగరానికి గుర్తింపు ఉండాలి. పట్టణపు పేరే లేకుండా రహదారులు ఎలాంటి అభివృద్ధికి మార్గం చూపుతాయి? సత్వర పరిష్కారం కోసం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు తక్షణ వినతి, చిత్తూరు పేరు మరియు దూరాన్ని బోర్డులో స్పష్టంగా పొందుపరచాలన్నారు. గౌరవనీయ ఎంపీ, ఎమ్మెల్యేల మద్దతు కోరుతూ వినతి: నగర అభివృద్ధికి ఇది అత్యంత ప్రాధాన్యమైన విషయం,వాణిజ్య సంఘాలు, హోటల్ పరిశ్రమ, స్థానిక పర్యాటక శాఖ, యువత సంఘాలు, స్థానిక మీడియా కూడా ఇందులో భాగస్వాములు కావాలని స్థానికులు అంటున్నారు.

## తోతాపురం రూ.4 ప్రభుత్వం చెల్లింపు - పలమనేరు ఆర్డీఓ భవానీ



బంగారుపాళ్యం, జూన్ 18 ప్రభాతవార్త: మామిడి రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి రకం మామిడి కాయలు కేజీకి రూ.4 చెల్లిస్తోందని పలమనేర ఆర్డీఓ భవానీ తెలిపారు. బుధవారం బంగారుపాళ్యం సచివాలయంలో పొలం పిలుస్తోంది సమావేశం వ్యవసాయ శాఖ చేపట్టింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ భవానీ మాట్లాడుతూ మామిడికాయల ధరలు రోజు రోజుకు తగ్గుతున్న విషయంను ప్రభుత్వం గుర్తించి రైతులను ఆదుకోవాలనే దిశగా ముందుకు వెళ్తున్నదన్నారు. ర్యాంపుల వద్ద అమ్మకాలు జరిపే రైతులకు సైతం ప్రభుత్వం గిట్టుబాటు ధర అందిస్తోందన్నారు. ర్యాంపుల వద్దకు కాయలు తీసుకెళ్ళే రైతులు ఆధార్ కార్డు, వన్‌బి పాసు బుక్కు, బ్యాంకు అకౌంట్ జెరాక్స్ కాపీలను అక్కడే వున్న అధికారులకు అందజేయాలన్నారు. అలాగే పల్ప్ ఫ్యాక్టరీలకు తరలించే రైతులు ఫ్యాక్టరీ యాజమాన్యం పర్మిట్ ఇచ్చిన అనంతరం కాయలను తరలించాలన్నారు. ముఖ్యంగా పరిపక్వంకు వచ్చిన కాయలు మాత్రమే కోతలు కొయ్యాలని, ఆ కాయలు మాత్రమే పల్ప్ ఫ్యాక్టరీలకు తరలించాలని రైతులకు సూచించారు. పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు కేజీపై రూ.8 చెల్లిస్తోందని, మిగిలిన రూ.4 ప్రభుత్వం రైతు బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు రాజేంద్రప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లా ప్రజా రవాణాధికారిగా రాము

చిత్తూరురూరల్, జూన్ 18 ప్రభాతవార్త:



చిత్తూరు జిల్లా ప్రజారవాణాధికారి( డిపిటివో)గా రాము బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కొత్తబస్టాండ్‌లోని తన కార్యాలయంనందు విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ప్రజారవాణాధికారిగా పనిచేస్తున్న తాను ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో చిత్తూరుకు రావడం జరిగిందనీ, గతంలో చిత్తూరు జిల్లాకు చెందిన పలమనేరు ఆర్టీసిడిపో మేనేజరుగా, చిత్తూరు ఆర్టీసి డిపోలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరుగా పనిచేసిన అనుభవం వుందన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం రానున్న రోజుల్లో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తానని, ముఖ్యంగా వేలూరు నుంచి తిరుమలకు నడుపుతున్న బస్సుల్లో చిత్తూరు ప్రయాణీకులను అనుమతించకపోవడం సమస్యను త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అలాగే జిల్లాకు ఎలక్రిక్ బస్సులు రెండవ విడతలో మంజూరు అయ్యే అవకాశం వుందని ఆర్టీసి ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది, ప్రయాణీకుల సమస్యలను సైతం పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## మామిడి రైతులకు మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు

సోమల, జూన్ 18, ప్రభాతవార్త

ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రతి రైతు వద్ద మామిడి ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటుందని తాసిల్దార్ బెన్నురాజు తెలిపారు. మండలంలోని ఇలికిపెంట పంచాయతీలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు అధ్యక్షతన రైతులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ నాలుగు రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని దీనిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొందరపడి రైతులు ఒకే మారు మామిడి కోత చేసి ఒప్పిడి చేస్తే ఫ్యాక్టరీలకు పంపడం కష్టతరమవుతుందని టోకెన్ సిస్టం ద్వారా ఫ్యాక్టరీలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరికిపెంట చెరువు అభివృద్ధి కమిటీ చైర్మన్ గల్లా బోస్, మాజీ చైర్మన్ కోటేశ్వరరావు, చంద్రశేఖర్ నాయుడు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## దైనందిన జీవితంలో యోగా ముఖ్యం

పుంగనూరు, జూన్ 18, ప్రభాతవార్త



దైనందిన జీవితంలో యోగా పాత్ర పోషిస్తోందని, మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతగానో తోడ్పడుతుందని. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ అయూబ్ ఖాన్ అన్నారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో యోగ టీచర్ వనితకి సన్మానం చేయడం జరిగింది. ఈ నెల 21న విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరగనున్న యోగా దినోత్సవంలో ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా శేషాద్రి

కల్లూరు, జూన్ 18, ప్రభాతవార్త

పులిచెర్ల ఎంపిడిఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గా. శేషాద్రి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ శేషాద్రి మాట్లాడుతూ అందరు సహకారంతో ప్రభుత్వ పథకాల అమలులో నిరంతరం కృషి చేస్తామని అన్నారు.

## ఔట్‌సోర్సింగ్ జీతాలు పెంచాలి కొనసాగుతున్న దీక్షలు

పుంగనూరు రూరల్, జూన్ 18, ప్రభాతవార్త



పురపాలక సంఘాలలో ఇంజనీరింగ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులకు ఉద్యోగ భద్రతతో పాటు మినిమం టైం స్కేల్ ఏర్పాటు చేయాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కూడా ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కిల్ వర్కర్లకు 29,200, సెమీ స్కిల్ వర్కర్లకు 24,500 జీతాలు నిర్ణయించాలని, పదవి విరమణకు రూ. లక్ష, పెన్షన్ 10000 అందించాలని, వీటితోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు విద్యార్థిమిత్ర కిట్లు పంపిణీ

కుప్పంరూరల్, జూన్ 18 ప్రభాతవార్త



కుప్పం ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు విద్యార్థిమిత్ర కిట్లను నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, ఎస్ఎంసి చైర్మన్ అల్లాబకష్, వైస్ చైర్మన్ అస్మత్ తదితరులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. పాఠశాల సమస్యల పరిష్కారంకు చర్యలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్ సింగ్, నేతలు ఖాసీమ్, జాలు, షామీర్ పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో ఉద్యోగాలకు 126మంది ఎంపిక

శాంతిపురం, జూన్ 18 ప్రభాతవార్త




స్థానిక ప్రభుత్వ ఐటిఐ కాలేజ్‌లో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. హిందాల్కో,స్కైబర్ డైనమిక్స్, షాహీ గార్మెంట్స్, అమరరాజీ, ఆంపినల్ సంస్థల తరపున ప్రతినిధులు వెన్నెల, వినీత్, వంశీకృష్ణ, జగదీష్, హరీష్‌లు హాజరై ఇంటర్వ్యూలు జరిపారు. మొత్తం 160మంది విద్యార్థులు హాజరు కాగా 126మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శేషారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారులు హితేంద్రకుమార్, కళ్యాణ్‌కుమార్, సిబ్బంది జోగేందర్, లోకేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీపై పీడు పంపిణీ

పూతలపట్టు, జూన్ 18, ప్రభాతవార్త



రైతులకు సబ్సిడీ పై పీడు పంపిణీ చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు మురళి చంద్రమోళి తెలిపారు. మండల కేంద్రంలో పూతలపట్టు పశు వైద్యశాల కార్యాలయంలో బుధవారం స్థానిక గుంటూరు మురళి చేతుల మీదుగా రైతులకు 50 సబ్సిడీతో ఫీడ్ పంపిణీ కార్యక్రమాని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 కేజీలు పీడు 1100 రూపాయలు కాగా 550 రూపాయలు సబ్సిడీతో 550 రూపాయలు రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో పశు వైద్యశాల కార్యాలయంలో ముందుగానే నమోదు చేసుకొని నగదు చెల్లించి ఫీడ్ పొందవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సిపి పూతలపట్టు సర్పంచ్ మాచలామని, టిడిపి ఎక్స్ మండల అధ్యక్షుడు చంద్రమౌళి, వెటర్నరీ డాక్టర్ దీపాన్ని డాక్టర్ విజయకుమార్, రైతులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల శాఖ ఎడిగా వినోద్

చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:

విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడిగా వినోద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడిగా విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ బదిలీపై కాకినాడ వెళ్ళగా ప్రభుత్వం చిత్తూరు, తిరుపతి జిల్లాల విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వినోద్ బదిలీపై వచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల శాఖ ఎడి కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో ఎడిగా వినోద్ బాధ్యతలు స్వీకరించారు. ఎడిగా బాధ్యతలు స్వీకరించిన వినోద్‌ను పలువురు ఉద్యోగ సంఘ నేతలు కలిసి అభినందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కుప్పంలో అశాంతి సృష్టించాలని చూస్తే సహించేది లేదు

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త రాష్ట్రంలో, కుప్పంలో వైకాపా చేస్తున్న దురాగతాలకు ప్రజలే మరలా బుద్ధి చెబుతారని ప్రభుత్వ విప్,ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం మండలంకు చెందిన వైకాపా నేత, కోఆప్షన్ మెంబర్ అతహర్ అంగన్‌వాడీ కార్యకర్తపై దాడికి తెగబడడం దారుణమన్నారు. అతహర్ రౌడీషీటర్ అని అతనికి కోఆప్షన్ ఇచ్చిన ఎమ్మెల్సీ భరత్ అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. కుప్పంలో సిఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు వైకాపా కుయుక్తులు పన్నుతోందన్నారు. పోలీసు అధికారులు కూడా ఇలాంటి వ్యవహారాలపై దృష్టి సారించాలని కోరుతున్నట్లు చెప్పారు. కుప్పంలో అశాంతి సృష్టించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రశాంత కుప్పాన్ని వైకాపా పాలనలో రావణకాష్టంగా మార్చారన్నారు. సిఎం చంద్రబాబు పాలనలో తాము అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెడితే వైకాపా శ్రేణులు అభివృద్ధిని దెబ్బతీయాలని చూడదంతగదన్నారు. చట్టపరమైనచర్యలుతప్పవనిహెచ్చరించారు. అంగన్‌వాడీకార్యకర్తకుఅండగాఉంటామన్నా రు

## పెద్దకొండామర్రిలో ఘనంగా గంగజాతర

చౌడేపల్లి, జూన్ 18 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండామర్రిలో బుధవారం గంగజాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున వున్న గంగమ్మకు విశేషాభిషేకాలు, అలంకరణలు గావించారు. గ్రామానికి మూడు దిక్కుల్లో గల గ్రామ దేవతలకు రాత్రంతా మహిళలు జాగారణ వుండి పిండిదీపాలతో ఆరాధించారు. జాతర సందర్భంగా గ్రామంలో మిరుమిట్లు గొలిపే దీపాలతో అలంకరించారు. చుట్టు పక్కలవారుతరలిరావడంతో పెద్దకొండామర్రిలో సందడి నెలకొంది.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చౌడేపల్లి, జూన్ 18 ప్రభాతవార్త

స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 19న ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. చెన్నై ఎంఎన్ ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో జరిగే శిబిరంలో కంటి సమస్యలున్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆపరేషన్లకు అర్హత పొందిన వారికి ఉచితంగా చేస్తారన్నారు. కంటి జబ్బులున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

## కుప్పం ఎంఇఓను సస్పెండ్ చేస్తూ ఆర్జేడి ఉత్తర్వులు

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త

కుప్పం మండల విద్యాశాఖాధికారి మహబూబ్‌బాషాను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఆర్జేడి (కడప) శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం సమీపంలోని హాకింగ్స్ స్కూల్ పాఠశాల ఇక ముందు సిబిఎస్ఇ సిలబస్‌తో కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను ఖాతరు చేయక ఎంఇఓ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేయడంతో పాటు అధికార దుర్వినియోగంకు పాల్పడ్డారని దీంతో ఎంఇఓ మహబూబ్‌బాషాను సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఇన్‌చార్జ్ ఎంఇఓగా గుడుపల్లె ఎంఇఓ శ్రీదేవిని నియమిస్తూ ఆర్జేడీ ఆదేశాలు జారీ చేశారు.

## నీట్‌లో కెజెసి విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త

నీట్ – 2025 ప్రవేశ పరీక్షలో కుప్పం జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కాలేజ్ ఛైర్ పర్సన్ శాంత నాగరాజ్ తెలిపారు. శంకర్ 548/720, రంజిత్ 513, అను 489మార్కులతో ఎంబిబిఎస్ సీట్లను సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఛైర్ పర్సన్ శాంత నాగరాజ్, ప్రిన్సిపాల్ సుప్రియ, అధ్యాపకులు అభినందించారు.

## సిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం



కాణిపాకం, జూన్ 18 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు బుధవారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు తిరుపతికి చెందిన పంచజయన్ అనే భక్తుడు ఈపథకానికి 1,00.116 విరాళంగా అందజేశారు. ఈమొతాన్ని దాతలు కుటుంబ సభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వరసిద్దుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



కాణిపాకం, జూన్ 18 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజి, ప్రముఖ సినీ నిర్మాత, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణలు వేర్వేరుగా కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు బాలాజినాయుడు, రవి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## మాజీ కార్పొరేటర్‌కు ఆర్థికసాయం



చిత్తూరురూరల్, జూన్ 18 ప్రభాతవార్త: చిత్తూరు పట్టణం, 8వ వార్డు మాజీ కార్పొరేటర్ అన్నపూర్ణకు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తండ్రి జిజెఎం ఛారిటబుల్ పౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు రూ. 50వేల ఆర్థికసాయం అందించారు. ఇటీవల తను ఆడబిడ్డకు జన్మనివ్వడంతో వారి ఇంటికి వెళ్లి ఆరోగ్యపరిస్థితిని, యోగ క్షేమాలను అడిగి తల్లి, బిడ్డ క్షేమంగా వుండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు వెంకటేష్‌యాదవ్, మహిళా నాయకురాళ్లు రాణమ్మ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు రూరల్ తహసిల్దారుగా జయప్రకాష్

చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త: చిత్తూరు రూరల్ మండల తహసిల్దారుగా జయప్రకాష్ బుధవారం తహసిల్దారు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు చిత్తూరు రూరల్ మండల తహసిల్దారుగా విధులు నిర్వర్తించిన లోకేశ్వరి ఐరాల మండల తహసిల్దారుగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో చిత్తూరు రూరల్ మండల తహసిల్దారుగా జయప్రకాష్ నియమితులు కావడంతో ఆయన బుధవారం తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. జయప్రకాష్‌ను జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మేషక్‌లు కలిసి అభినందలు తెలిపారు.

# అభివృద్ధి..సంక్షేమమే మా తపన - ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమే సిఎం చంద్రబాబునాయుడుతో పాటు తాము తపన పడుతున్నట్లు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మున్సిపల్, మండల పార్టీ అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపిపి సాంబశివం, డా॥ వెంకటేష్ తదితరులతో కలసి మాట్లాడారు. కూటమి పాలన విజయవంతంగా నడుస్తుండడాన్ని జీర్ణించుకోలేక వైకాపా శ్రేణులు ప్రభుత్వంపై బురద చల్లితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నారన్నారు. అలాంటి సమయంలో వైకాపా కుట్ర రాజకీయాలకు తెరలేపుతోందన్నారు.



జగన్‌కు చెందిన మీడియాలో అమరావతిని వేశ్యల రాజధాని అని చెప్పడం, కుప్పం ఘటనలో టిడిపి శ్రేణులు మహిళను చెట్టుకు కట్టేసి కొట్టారని దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. బుధవారం రాగిమానుమిట్ట గ్రామంలో వైకాపా నేత, రౌడీషీటర్ అయిన అతహర్ అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి చేశాడన్నారు. ఇది ఎవరి ప్రోద్బలంతో జరిగిందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ భరత్ ఈ ఘటనపై

**- ప్రభుత్వంపై బురద చల్లితే చూస్తూ ఊరుకోం !!**

కుప్పం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నారాయణపురం ఘటన గురించి పూర్తిగా తెలుసుకోక భరత్ హత్యాచారం చేశారని పేర్కొనడం దారుణమన్నారు. కుప్పంలో అలజడి సృష్టించాలని వైకాపా నేతలు యత్నిస్తున్నారని సిఎం చంద్రబాబునాయుడు అందుకు అడ్డుకట్ట వేస్తారన్నారు.ఈనెల 23నుంచి కుప్పంలో ప్రతి ఇంటికి వెళ్లి తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశంలో నేతలు సత్యేంద్రశేఖర్, కాణిపాకం వెంకటేష్, మహేంద్ర, రామచంద్ర, రాజా, ప్రతాప్, మహిళా నేతలు అనసూయ, సుగుణమ్మ, స్వాతి, నవనీత

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన సత్యవేడు ఎమ్మెల్యే

నారాయణవనం, జూన్ 18 ప్రభాతవార్త :



రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధ వారం సిఎం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం వినతిపత్రం అందించారు. రాష్ట్ర సిఎం తనతో అప్యాయంగా స్పందించి పలకరించారన్నారు. అనంతరం సిఎం కార్యాలయానికి చేరుకొని సత్యవేడు నియోజకర్గంలోని 13మంది బాధిత కుటుంబాలకు చెందిన సిఎం రిలీఫ్‌పండ్ చెక్కులను సిఎంఓ కార్యాలయం నుంచి తీసుకున్నారు. తన సిపార్సు మేరకు తనకు సత్యవేడు నియోజకవర్గంలోని 13మంది బాధితులను సిఎం రిలీఫ్‌పండ్ ద్వారా ఆదుకున్న సిఎం చంద్రబాబుకు కృతజ్ఞత అభినందనలు తెలిపారు. అనంతరం ఆర్అండ్‌బి కార్యాలయంకు చేరుకొని నియోజకర్గంలోని పెండింగ్ రోడ్ల సమస్య గురించి వివరించి, నిధులు మంజూరు చేసి పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## శీవారిసేవలో డాక్టర్ హరిప్రసాద్



తిరుమల.జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:

రాష్ట్రహస్తకళల అభివృద్ధిసంస్థ ఛైర్మన్ డాక్టర్ హరిప్రసాద్ కుటుంబంతో కలసి బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన ఆలయంలోనికి చేరుకుని శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎముకలసాంద్రతను కాపాడుకోవాలి

-ఉచితవైద్యశిబిరంలో డాక్టర్ సుకుమార్

తిరుపతిహెల్త్,జూన్ 18ప్రభాతవార్త

45 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఎముకల సాంద్రత పరిరక్షించుకోవాలని, ఎముకల సాంద్రత



పరీక్షలు ప్రతి 3నెలలకోసారి చేసుకుని పోషకాల ఆహారాన్ని ఆవశ్యకంగా స్వీకరించాలని సాయిసుధ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బి.సుకుమార్ సూచించారు. 40 సంవత్సరాలుపైబడిన ప్రతి ఒక్కరిలో ఎముకల సాంద్రత తగ్గడంతో అనుకూలత,ఎముకలకు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా పరీక్షలు నిర్వహించి తగిన నివారణ చర్యలను వైద్యులనుండి తెలుసుకోవాలన్నారు. బుధవారం ఉదయం రెడ్డిరెడ్డికాలనీలోని సాయిసుధ ఆస్పత్రిలో బిఎండి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ సుకుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ సుబ్బానాయుడు, డాక్టర్ వినయకుమార్, డాక్టర్ సుధారాణి ,డాక్టర్ హిమబిందు బిఎండి పరీక్షలు చేసి, అవసరమైన వారికి శస్త్రచికిత్సల సూచనలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయిసుధ ఆస్పత్రి ఫిజియోథెరఫీ డాక్టర్ సునీత, సురేంద్ర, ద్వారక, నేతాజీ, శీను, హేమంత్,నరేంద్ర, సిస్టర్స్ సంధ్య,సిందు,శ్రీనాథ్ పాల్గొన్నారు.

## ఎంతకీ తెగని సుబ్బరాయులు పంపు సెట్టు స్థల వివాదం...

.పట్టు వదలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు..

రేణిగుంట జూన్ 18 ప్రభాతవార్త



ఆక్రమణకు గురైందంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న రేణిగుంట పాంచాలి నగర్ సుబ్బరాయులు పంపు షెడ్ స్థల వివాదం నాలుగు సార్లు డిఎల్పిఓ లు విచారణ జరిపినప్పటికీ కొలిక్కి రాలేదంటూ రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీఆర్ రావణన్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థలం ఆక్రమణకు గురైందని వీఆర్ రావణన్ జిల్లా పంచా యతీ ఉన్నతాధికారులకు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యాలయానికి పంపిన ఫిర్యాదు మేరకు బుధవారం శ్రీకాళహస్తి డిఎల్పిఓ పద్మజ విచారణ నిమిత్తం రేణిగుంట పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. పంచాయితీ కార్యదర్శి మాధవి సమక్షంలో ఫిర్యాదుదారుడు రావణన్ పిలిపించి ప్రత్యేక విచారణ జరిపారు. అనంతరం పద్మజ, ఫిర్యాదుదారుడుతో ఆక్రమణకు గురైనట్లు భావించబడుతున్న స్థలాన్ని పరిశీలించారు. అయితే ఈ స్థల వివాద విషయం గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతూనే ఉంది. ఇప్పటివరకు ఈ విచారణతో నాలుగు సార్లు విచారణ జరగడం గమనార్హం. అధికారులు ఖరాఖండిగా తేల్చి చెప్పడం లేదంటూ ప్రజలు అనుకుంటున్నారు. పంచాయతీ స్థలాన్ని కాపాడడం తన బాధ్యతగా భావించి పోరాడుతున్నానని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావణన్ విలేకరులతో అన్నారు. ఈ విషయమై డిఎల్పిఓ పద్మజ వివరణ ఇస్తూ తాను శ్రీకాళహస్తి డిఎల్పిఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించానన్నారు.ఫిర్యాదుదారుడుఫిర్యాదుమేరకుఉన్నతాధికారులఆదేశాలతో విచారణకు వచ్చామన్నారు. ప్రాథమికంగావిచారించామని,మరలవిచారణకు వస్తామని అప్పుడు నిజ నిర్ధారణ జరుపుతామని తెలిపారు.

# తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి పోటాపోటీ

## -అభిప్రాయ సేకరణతో అధిష్టానంకు నివేదిక

కోట, జూన్ 18 ప్రభాతవార్త: మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ పదవికి బుధవారం స్థానిక షాదీ మంజిల్ లో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు, ప్రస్తుత మండల కన్వీనర్ మద్దాలి సర్వోత్తమరెడ్డి,పాదర్తి కోటీశ్వరరెడ్డిలు పోటీ పడ్డారు. దీంతో ఈ నేపథ్యంలో ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులు ఒక్కొక్కరు వారి అభిప్రాయాల్ని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు శివకోటారెడ్డి, రమేష్ నాయుడులు మాట్లాడుతూ మండల కన్వీనర్ పదవికి నలుగురు పోటీ పడటంతో 100 మంది నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, మహిళ నాయకులు నుంచి అభిప్రాయ సేకరణ తీసుకున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక పంపాతామని చెప్పారు.40 ఏళ్ల తెలుగుదేశం పార్టీ చరిత్రలో కోట మండల తెదేపా అధ్యక్ష పదవికి ఇంతగా పోటీ పడిన దాఖలలు లేవుని రాజకీయ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. పార్టీ అధిష్టానం ఎవరిని సూచిస్తే వారిని నియమించేవారు. కానీ నేడు పరిస్థితి అలా లేదు. కోట మండలంంలో వర్గా విబేదాలు ఒక్క సారిగా బయట పడ్డాయి, దీంతో అధ్యక్ష పదవికి నలుగరు పోటీలో నిలవడంతో ఎవరిని ఎన్నికోవాలో పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారింది.దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతేగని చర్చులు నడిచాయి. ఒక్కొక్కరని పిలిచి నాయకులు మాట్లాడిన ఎకాభిప్రాయం కుదరలేదు.దీంతో మండలంలోని 21 గ్రామ పంచాయతీలోని కీలక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధలు అభిప్రాయం తీసుకున్నారు.

# గూడూరు డివిజన్

## టిడిపి కార్యకర్తలు అండగా పార్టీ ఉంటుంది : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూన్ 18 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. బంగారు పేటకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాలాజీ తెలుగు కాలంలో ప్రమాదవశాత్తు పడే మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. పార్టీ కూడా ఎప్పుడు అండగా ఉంటుందని చెప్పారు. ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఆనంద్,కోటేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న



గూడూరు, జూన్ 18 ప్రభాతవార్త: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని శ్రీ కృష్ణా సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం గుడూరు పట్టణంలోని గమళ్ళపాలెం ప్రాంతంలో ఉన్న ఓం సాయి రాం వృద్ధాశ్రమం నందు మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయూరిశ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హోమ్ టేకర్ కల్యాణిలు పాల్గొన్నారు.

## మిసైల్ మ్యాన్ పేరిట ట్రస్ట్‌చే ఎన్నో సేవా కార్యక్రమాలు



గూడూరు, జూన్ 18 ప్రభాతవార్త: గూడూరుకు విచ్చేసిన సౌత్ సెంట్రల్ రైల్వే డిఐజి ఎండి. షాదాబ్ జెబ్‌ఖాన్‌కి శాలవాలతో, పూలమాలలతో సత్కరించి, పూల బొకే అందజేసి ఘన స్వాగతం పలికిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఎస్.సి.ఆర్, డి.ఐ.జి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సైల్ మాన్ పేరిట ట్రస్ట్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్న తాజుద్దీన్‌కి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ట్రస్ట్ సభ్యులనీ ఆప్యాయంగా పలకరించి ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని అలాగే మీ సేవలు కార్యక్రమాలు ఈ యొక్క గూదూర్ డివిజన్ కె కాకుండా జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యం. నరేంద్రనాథ్ చౌదరి, పాస్ సంస్థ ఛైర్మెన్ దగ్గోల్ సురేంద్రబాబు, షేక్ అరీఫ్, షేక్ నాయకుల ఫయాజ్, వై శ్రీనివాసులు, షేక్ మక్బూల్, ధనుష్ కృష్ణ చౌదరి, ప్రసాద్ గౌడ్, మనోజ్ కుమార్, బి.పృద్వి, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెకానికల్‌లో డిజైన్ శిక్షణా తరగతులు ప్రారంభం



కోట,జూన్ 18 ప్రభాతవార్త: మండలం విద్యాగనర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో డిజైన్‌లో వేసివి శిక్షణా తరగతులను బుధవారం ప్రారంభించారు.శిక్షణ తరగతులు డైనిమిక్ జనరిక్ సోల్యూషన్స్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా కళాశాల డైరెక్టర్,డాక్టర్, విజయకుమార్‌రెడ్డి, ఆసంస్థ వ్యవస్థాపకులు నాగార్జునలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మెకానికల్ విద్యార్థులకు డిజైన్ పరిజ్ఞానంతో పాటు అనాసిలిన్‌పై కూడా శిక్షణ తరగతులను నిర్వహించ చడం జరుగుతుందన్నారు. డిజైన్‌లో విస్తతంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ఇలాంటి కార్యక్రమాలను తమ కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి ఎంతోగానో ప్రోత్సహిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఒడి డా.విక్రమ్‌కుమూర్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్,డాక్టర్ ఎన్.కిషందర్, కోఆర్డినేటర్, డా.వై.అశోక్‌కుమూర్‌రెడ్డి, డా.శ్రీహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే



నాయుడుపేట, జూన్ 18 ప్రభాతవార్త : ప్రతిరోజు యోగా చేయడం వల్లన ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని మునిరత్నంనగర్‌లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లడుతూ ప్రతిరోజు ఉదయం విధిగా యోగా చేయడం వల్లన మానసిక ఇత్తిడి తగ్గించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చున్నారు. అనంతరం మెప్మా సిబ్బందికి ప్రభుత్వం ద్వార మంజూరు చేసిన ట్యాబ్‌లను ఆమె చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తెదేపా నాయకులు,సచివాలయ,మెప్మా,మున్సిపాల్టి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.,

## కాణిపాకం ఆలయంలో ఆర్‌జెసీ విస్తృత పర్యటన



కాణిపాకం, జూన్ 18 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై దేవాదాయశాఖ తిరుపతి ఆర్‌జెసీ చంద్రశేఖర్ ఆజాద్ బుధవారం పరిశీలించారు. బుధవారం కాణిపాకం పర్యటనకు విచ్చేసిన ఆయన దేవస్థానంలో ఆలయ అధికారులతో కలసి విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. కాణిపాకం దేవస్థానం ఈఓ కె.పెంచల కిషోర్, అధికారులతో కలసి పర్యటిస్తూ మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈమేరకు ప్రధాన ఆలయం వద్ద క్యూలైన్లు, లడ్డూ పోటు, పడితరం స్టోర్, అన్నదానం, సీసీ కెమెరాలు రూము నందు ఏర్పాట్లును పరిశీలించారు. ఈసందర్బంగా భక్తుల సౌకర్యార్థం ఆలయ వద్ద ఏర్పాటు చేసిన మౌలిక వసతుల గురించ ఆర్‌జెసికి ఆలయ ఈఓ వివరించారు. ఆలయ ఏఈఓలు కృష్ణారెడ్డి,రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు విధుల్లో క్రమశిక్షణ తప్పనిసరి

### -తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు



చంద్రగిరి, జూన్ 18 ప్రభాతవార్త: పోలీసు విధుల్లో క్రమశిక్షణ అత్యంత ప్రధానమైనదని తిరుపతి ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అన్నారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని సిబ్బందిపై ఆరా తీసిన ఆయన ఎవరు ఎక్కడ విధులు నిర్వహిస్తు న్నదీ అడిగితెలుసుకున్నారు. ఇతర ప్రాంతాలకు విధుల నిమిత్తం వెళితే పాస్ పోర్టు ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. రికార్డులను, నోటీసులోని 16 అంశాలను పరిశీలించారు. పెండింగ్‌లో వున్న కేసులను త్వరితగతిన పరిష్కరిం చేందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నోటీసు బోర్డులో నూతన చట్టాలను నమోదు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించా లన్నారు. నేరస్థులు పోలీసు నిఘాలో వుండాలనీ, లేని పక్షంలో ఉన్నతాధి.కారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసు విధుల్లో క్రమశిక్షణను విస్మరించి, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టేషన్ స్థితిగతులు, ఇతర అంశాలపై డీఎస్పీ ప్రసాద్, ఎస్ఐ అనిత ద్వారా తెలుసుకున్నారు.

## తోతాపూరి కొనడానికి ప్రభుత్వం సిద్ధం : జిల్లా ఎస్పీ



పాకాల, జూన్ 18 ప్రభాతవార్త: మండలం దామలచెరువులో బుధవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మామిడికాయ మండి వ్యాపారస్తులతో రైతులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీతో చంద్రగిరి డిఎస్పి ప్రసాద్ విచ్చేశారు. దామలచెరువు లోని మ్యాంగో నగర్‌కు విచ్చేసి ర్యాంపులను పరిశీలించి, వ్యాపారస్తులతో రైతులతో మాట్లాడారు. తోతాపూరి రకం మామిడి చివరికాయ అమ్మే వరకు రైతులను రాష్ట్ర ప్రభుత్వము అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎవరు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. మామిడికాయల రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు ఎక్కడ కూడా నష్టపోకుండా చివరి కేజీ వరకు కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పాకాల సీ.ఐ సుదర్శన్ ప్రసాద్, వ్యాపారస్తు, రైతులు పాల్గొన్నారు.

## మహిళా భద్రత కోసం డ్రోన్ నిఘా

చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త: చిత్తూరు నగరంలో మహిళల భద్రత కోసం పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. చిత్తూరు నగర పరిధిలో తెల్లవారుజాము, సాయంత్రం వేళల్లో అత్యధిక మహిళలు వాకింగ్ కోసం వెళ్తుంటారు. ఈ సమయంలో వారికి ఎలాంటి ఆపద కలుగకుండా వుండటానికి ఎస్పీ మణికంఠ చందోలు డ్రోన్ నిఘాను ఏర్పాటు చేశారు. చిత్తూరు జిల్లాలో పోలీసు విభాగం మహిళల భద్రతను అత్యంత ప్రాధాన్యతగా పరిగణిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వెళ్ళే మహిళలు నిస్సంకోచంగా, భయభ్రాంతులు లేకుండా స్వేచ్ఛగా వ్యాయామం చేయడానికి అనుకూలమైన, భద్రమైన వాతావరణం కల్పించడానికి ఎస్పీ చర్యలు చేపట్టారు. ఈ డ్రోన్ నిఘాలో భాగంగా ఉదయం 5 నుండి 8 గంటల వరకు కట్టమంచి వాకింగ్ ప్రాంతం, మెసానికల్ గ్రౌండ్, పివికెఎన్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో డ్రోన్ నిఘా వుంచారు. ఈ ప్రాంతాల్లో బుధవారం నుండి ప్రతి రోజు డ్రోన్ నిఘా వుంటుందని పోలీసులు పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు : ఎంపీపీ



వెంకటగిరి, జూన్ 18 ప్రభాతవార్త: సమావేశంలో ప్రజా ప్రతినిధులు చెప్పిన పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తమ్మిరెడ్డి తనుజరెడ్డి తెలిపారు. సమస్యలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలు సమస్యలను ప్రజా ప్రతినిధులు అధికారులు దృష్టికి మండల సమావేశంలో తీసుకొని వెళ్లారు. ఎంపీటీసీలు సర్పంచులు చెప్పిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తానని ఎంపీపీ వారికి తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు సర్పంచులు అధికారులకు తెలిపారు. ఎంఈఓ తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ఇంకా పడలేదని పలువురు తల్లులు తన దృష్టికి తీసుకు వచ్చారని అర్హులైన వారందరికీ నగదు జమవుతుందని తెలిపారు. పశుసంవర్ధకశాఖ అధికారి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ పశువుల కొరకు రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఉద్యోగస్తులు కూడా రుణాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు బాబురావు, భూపతి బాబు, రోడ్లు భవనాలశాఖ ఏఈ బాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సుధాకర్, పెంచలయ్యలు పాల్గొన్నారు.

## కార్మికులకు పిల్లలకు తల్లికి వందనం పథకం ఇవ్వాలి



వెంకటగిరి, జూన్ 18 ప్రభాతవార్త : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వడ్డీపల్లి చంగయ్య కోరారు. వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద డిమాండ్ల సాధనకు మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. మున్సిపల్ కార్మికులు చాలా పేదవారని జీతాలు కూడా వారికి సక్రంగా రావడం లేదని వీరి పిల్లలకు తల్లికి వందనం అమలు చేయకపోవడం విచారకరమన్నారు. తల్లికి వందనం పథకం పారిశుద్ధ కార్మికులు పిల్లలకి ఇవ్వకపోతే వారి పిల్లలను చదివించుకోలేరని తెలిపారు. పెంచిన జీతాలు కూడా వెంటనే ఇవ్వాలని ఆయన కోరారు. పారిశుద్ధ కార్మికులను మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లనేయకుండా సిఐ ఏవి రమణ, సిబ్బంది అడ్డుకున్నారు. నలుగురు మాత్రమే కార్యాలయంలోకి వెళ్లి వినతి పత్రం ఇవ్వాలని అందరూ వెళ్లరాదని సీఐ కార్మికులకు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి పెట్టాలి : ఏఓ



కోట, జూన్ 18 ప్రభాతవార్త : మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ కోరారు. బుధవారం కోట, కొక్కుపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులతో పాటు శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శించి తెగుళ్లు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సలహాలు ఇస్తారని తెలిపారు. అందుబాటులోకి వచ్చిన యాంత్రీకరణ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధన, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

## వెన్నుపోటు దినం పుస్తక ఆవిష్కరణ



పెళ్లకూరు జూన్ 18ప్రభాతవార్త : మండలంలోని చిల్లకూరు లోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నాయకులు ఎలక్షన్ ముందు అనేక రకమైన హామీలు ఇచ్చి ఇప్పుడు అరాకొరగా కొన్ని పథకాలు అమలు చేసి మేము ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాము అని గొప్పలు చెప్పుకుంటున్నారు నిజానికి ఈ పథకాల అమలులో అర్హులందరికీ న్యాయం జరగడం లేదు ఈ విషయాలను ప్రశ్నిస్తే నాలుకలు మడతపెట్టి కోస్తామనడం సాక్షాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలా చెప్పడం ఎంతవరకు న్యాయము రాబోయే కాలంలో ప్రజలే నిర్ణయిస్తారు అన్నారు. ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత తారాస్థాయికి చేరుకుందన్నారు జగన్మోహన్ రెడ్డికి రోజురోజుకీ జనంలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అనేక రకాల అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ శేఖర్‌రెడ్డి ఎస్ఆర్‌సిపి మండల ప్రెసిడెంట్ వెంకటరత్నం బీసీ నాయకులు మోహన్ మరియు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగని ఇసుక అక్రమ రవాణా



పెళ్లకూరు, జూన్ 18 ప్రభాతవార్త: మండలంలోని చిల్లకూరు వైయస్సార్ సిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇసుక మట్టి గ్రావెల్ మాఫియా ఆగడాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయి అన్నారు అధికారులు అక్రమార్కులకు అమ్ముడుపోయి తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం స్టే విధించిన ప్రదేశాలలో కూడా అడ్డు అదుపు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ ఇసుక అక్రమ రవాణాను అధికారులు నియంత్రించకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు ఈ సమావేశంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి వైసీపీ మండలాధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం ఎంపిటీసీ కర్నూల్ కుమార్ ఎల్లు మోహన్ శ్రీనివాసరాజు మునిరాజా చక్రపాణి అట్ల కృష్ణయ్య కుమారి వీర కుమార్ తదితరులు పాల్గొన్నారు

## మోలాబాయ్‌ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



దొరవారి సత్రం, జూన్ 18 ప్రభాతవార్త: మండలంలోని వేణుంబాకం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మోలాబాయ్‌ని సూళ్లూరుపేట మాజీ శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఇటీవల మోలా బాయ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య బుధవారం నాయకులతో కలిసి వేణుబాకంలోని మోలాబాయ్ నివాసానికి చేరుకుని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిలివేటి సంజీవయ్య వెంట నవోదయ హైస్కూల్ ఈశ్వరవాక పద్మనాభరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు మునస్వామినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు అల్లూరు రాహుల్ రెడ్డి, నాయకులు నెలబల్లి సురేష్‌రెడ్డి, జాల రాజగోపాల్‌లు ఉన్నారు.

## బదిలీ అయిన ప్రిన్సిపాల్‌కు ఘనంగా వీడ్కోలు



బాలాయపల్లి, జూన్ 18 ప్రభాతవార్త : వెంగమాంబ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేసిన జె.ఎస్ రాంగోపాల్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. రాంగోపాల్ కళాశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఈ సందర్భంగా సిబ్బంది అన్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచారని తెలిపారు. ప్రిన్సిపాల్ కరుణ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ప్రైవేటు కళాశాల తో దీటుగా ఉన్నాయని చెప్పారు. అధునాతన వసతులు కూడా కళాశాలలో ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## మోడీతోనే దేశ ప్రగతి సాధ్యం



ఓజిలి, జూన్ 18 ప్రభాతవార్త: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తోనే దేశ ప్రగతి సాధ్యమని తిరుపతి ఓబీసీ జిల్లా అధ్యక్షులు గోపి ఆచారి, బిజెపి మండల అధ్యక్షులు పవన్ కుమార్ తెలియజేశారు. వికసిత భారతదేశపు అమృతకాలం, సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో వికసిత్ భారత్ సంకల్పసభ కార్యక్రమం ఓజిలి మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో బిజెపి మండల అధ్యక్షులు పవన్ కుమార్, మాజీ మండల కన్వీనర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ప్రధాన మంత్రిగా 11 సంవత్సరాల కాలంలో నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి అభివృద్ధి పనుల గురించి బిజెపి నాయకులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేస్తూ, ప్రజలకు అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఓబీసీ జిల్లా అధ్యక్షులు గోపి ఆచారి, బిజెపి మండల కన్వీనర్ పవన్ కూమార్, మాజీ మండల కన్వీనర్ వరప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, మాజీ సర్పంచ్ బిజెపి సీనియర్ నేత శేషయ్య, తిరుపతి జిల్లా కార్యవర్గసభ్యులు కొండూరు రవీంద్ర రాజు, శ్రీధర్‌రెడ్డి శ్రీధర్‌రెడ్డి, మనోహర్, మనోహర్, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విలీనాన్ని నిరసిస్తూ...తల్లితండ్రులు ఆందోళన




నారాయణవనం, జూన్ 18 ప్రభాతవార్త : ప్రస్తుతం వున్న పాఠశాలను వేరే పాఠశాలకు విలీనం చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళనకు దిగిన సంఘటన మండలం లోని అరణ్యంకండ్రిగ పంచాయతీలో చోటు చేసుకున్నది. మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీ పంచాయతీ ఎస్ఎన్‌కండ్రిగ దళితవాడ ప్రాదమిక పాఠశాలలో గతంలో 54మంది విద్యార్థులు వుండేవారు. వీరికి నలుగురు టీచర్లు చదువు చెప్పేవారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఎస్ఎన్ కండ్రిగ దళితవాడ పాఠశాలలో చదువుతున్న 3నుంచి5వరకు తరగతులకు చెందిన సుమారు 34మంది విద్యార్థు లను గోవిందప్పనాయుడు ప్రాథమిక పాఠశాలకు విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎస్ఎన్‌కండ్రిగ పాఠశాలలో 1,2 తరగతులకు చెందిన విద్యార్థులు 20మంది మాత్రమే వున్నారు. ఈ చదువుతున్న పిల్లలు సుమారు 1నుంచి2కిలో మీటరు దూరంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ పాఠశాలకు ఎలా వెళ్ల గలమని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దారి పొడవున కాలువలు, ముళ్ల కంపలు, విష పూరిత పాముల సంచారం వుందని అలాంటప్పుడు దగ్గరలోని పాఠశాలకు కాకుండా చాలా దూరంలోని పాఠశాలకు ఎలా వెళ్ల గలమని ఆవేదన వ్యక్త పరిచారు. తమ పాఠశాల గతంలో విధంగానే వుంచాలని, మేము గోవిందప్పనాయుడుకండ్రిగ ప్రాథమిక పాఠశాలకు వెళ్లమని గట్టిగా హెచ్చరించారు. ఇకపోతే ఇదే సమస్యను పడవేటమ్మ యానాధికాలనీ, ఈశ్వరయానాధి కాలనీ, చిత్తూరుకండ్రిగ, అరణ్యంకండ్రిగ పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి విద్యార్థుల కష్టాలను దృష్టిలో వుంచుకొని మరోక సారి ఆలోచించి చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో మరో సారి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ వైఎస్ ఎంపిపి వెంకటేష్, ఇంచార్జి సర్పంచ్ మురళి, మాజీ సర్పంచ్ ఆరుముగం, విద్యార్థులు, విద్యార్తుల తల్లితండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పానగల్ గంగమ్మ జాతర



శ్రీకాళహస్తి,జూన్ 18 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని పానగల్‌లో వెలసిన గంగమ్మ తెట్టురాయి వద్ద బుధవారం జాతర సంబరాలు మిన్నుముట్టాయి. ఆధ్యాత్మిక చింతన వెల్లివిరుస్తున్న పుణ్యక్షేత్రంలో ధార్మిక కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత చోటు చేసుకుంటుంది. బుధవారం పానగల్ జాతరలో ఎటు చూసినా గుంపులు గుంపులుగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సంబరాలను నిర్వహించటంలో కమిటి నిర్వాహకులు వారి సిబ్బంది ప్రణాళికా బద్ధంగా వ్యవహరించారు. అయితే ఈ ఏడాది కూటమి పార్టీలకు చెందిన యువకులు నిర్వహణచేపట్టారు, అలంకారాలు వేయి కళ్ళు అయినా చాలవన్నట్లు ఆకట్టుకున్నాయి. పూల మాలల సోయగాలు వర్ణించనలవి కాదు. మంగళవారం రాత్రి స్థావరం వద్ద చక్కగా గంగమ్మ ఉత్సవవిగ్రహాన్ని అలంకరించారు. కన్నులు మిరుమిట్లు గొల్పు విధంగా అమ్మవారిని తీర్చి దిద్ది ముసుగు తీసి బలి సమర్పించారు. అక్కడ నుంచి పొన్నాలమ్మగుడి, రైల్వేస్టేషన్ వరకు ఊరేగింపు రాత్రంతా సాగింది. గంగమ్మ ఊరేగింపు సందర్భంగా వివిధ వేషధారణలతో ప్రదర్శనలు జరిపారు. పానగల్, శ్రీరామ్‌నగర్ కాలనీల్లోని ఇంటింటి ముందు గంగమ్మకు మొక్కులు సమర్పించుకున్నారు. మేకలు, పొట్టేళ్ళను బలి ఇచ్చారు. సాధారణంగా తిరుపతి జాతర తరువాత పానగల్‌లో జాతర నిర్వహించటం ఆనవాయితి. మేళ తాళాలు,మంగళవాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు సాగింది. జాతర సందర్భంగా పానగల్‌లోని పొన్నాలమ్మ గుడి వరకు రోడ్డుకిరువైపులా విద్యుత్ దీపాల తోరణాలతో ముస్తాబు చేశారు. అలాగే హౌసింగ్‌బోర్డు కాలనీ వరకు ముస్తాబు చేశారు. ఈ ప్రాంతాల్లో అమ్మవారు ఊరేగింపు జరిపి మొక్కులు తీర్చుకున్నారు.

**విచిత్ర వేషధారణలు:**

ఈ ఏడాది యువకులు విచి త్ర వేషధారణల్లో పాల్గొన్నారు. జాతర సందర్భంగా రక రకాల వేషాలు ధరించి సొమ్ములు వసూలు చేసుకున్నారు. కొందరు రాక్షసుల వేషాలు ధరించి భయంకరంగా ఆకట్టుకున్నారు. మరి కొందరు మగవారు ఆడవేషాలు ధరించి ఆకట్టుకున్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందుజా గ్రత్త చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా వన్‌టౌన్ సిఐ గోపి ఆదేశాలతో గోవిందు వారి సహచరులు సహకరించారు.

## ఇది రైతు రాజ్యం...సద్వినియోగం చేసుకోండి:ఎమ్మెల్యే



తొట్టంబేడు,జూన్ 18 ప్రభాతవార్త: నియోజక వర్గం వ్యవసాయ ప్రధాన ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని వ్యవసాయంతోనే గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి చిన్నకనపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన డ్రోన్ల పంపిణి కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఇక్కడ ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు, తెలుగుదేశం కార్యకర్తలు కదలి వచ్చారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని అభివృద్ధి పరచుటకు తన తండ్రి పాడి పరిశ్రమను అభివృద్ధి చేసారన్నారు. నేడు వ్యవసాయం పాత పద్దతుల్లో చేస్తే లాభం ఉండదని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలన్నారు. రోజు రోజుకు వర్షాలు ప్రశ్నార్థంగా మారుతున్న తరుణంలో స్పింక్లర్స్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాకు ఆరు డ్రోన్లు వస్తే తొట్టంబేడు మండలానికి 5 శ్రీకాళహస్తి మండలానికి ఒకటి అందించటం ఈ ప్రాంతాల్లో వ్యవసాయానికిగల గుర్తింపుకు నిదర్శనం అన్నారు.ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌ఏ మాతృమూర్తి బొజ్జల బృందమ్మ,బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, మండల అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజా నాయుడు, గాలి చలపతి నాయుడు మాజీ అధ్యక్షుడు గాలిమురళి నాయుడు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కొత్త కమిషనర్ శ్రీనివాస్!?

శ్రీకాళహస్తి,జూన్ 18 ప్రభాతవార్త: మున్సిపల్ కమిషనర్‌గా పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఓ అధికారిని నియమించనున్నట్లు సమాచారం అందింది. ఇక్కడ పని చేసిన కమిషనర్ బియస్ గిరి కుమార్ గత నెల 30న రిటైర్డ్ అయ్యారు.ఆయన స్థానంలో ఫుల్ అడిషనల్ చార్జి కమిషనర్‌గా డిఇఇ సంజీవ్‌రావు బాధ్యతలు నిర్వహించారు. అయితే చీమకుర్తి మండల పరిషత్ అధికారిగా పని చేస్తున్న శ్రీనివాస్‌కు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు.